AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
26-6-2026 (Friday) MAIN EDITION

## కేతిరెడ్డి ధర్నా.. తాడిపత్రిలో ఉద్రిక్తత



**అక్షరటుడే, ఏపీ:** అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ఉదయం ధర్నాకు దిగారు. ఆయనను పోలీసులు అడ్డుకోవడంతో హైటెన్షన్ నెలకొంది. తాడిపత్రిలో రోడ్డుపై భైఠాయించి కేతిరెడ్డి పెద్దారెడ్డి ధర్నా చేశారు. ఆయనను పోలీసులు ఇంటికి తరలించారు. ఆందోళన ఉధృతం కాకుండా చర్యలు చేపట్టారు. ధర్నా స్థలం నుంచి వైసీపీ శ్రేణులను తరలించారు. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి తాడిపత్రికి రాకుండా వైసీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు.

## ద్రాక్షారామం కూరగాయల మార్కెట్‌లో అగ్నిప్రమాదం



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లోని అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామం కూరగాయల మార్కెట్లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదంలో 40కి పైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, సహాయక చర్యలకు ఆదేశించారు.

## సీషెల్స్ పర్యటనకు వెళ్లనున్న ప్రధాని మోదీ



అక్షరటుడే, ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూన్ 27 నుంచి 29 వరకు సీషెల్స్‌లో పర్యటించనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కానున్నాయి.

## కేటీఆర్‌ను కలిసిన బాల్క సుమన్



అక్షరటుడే, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్‌పై గురువారం విడుదలయ్యారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం కలిశారు. సింగరేణిపై చేసిన వివాదాస్ప వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో 27 రోజులు జైలులో ఉన్నారు.

## పతనమైన ముడిచమురు ధరలు



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భారీగా పతనమయ్యాయి. గ్లోబల్ బెంచ్ మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు ప్రస్తుతం 75.07 నుండి 71.79 డాలర్ల సమీపంలో ట్రేడవుతోంది. అదేవిధంగా, యూఎస్ బెంచ్‌మార్క్ అయిన వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 70 నుంచి 71 డాలర్లకు పడిపోయింది.

## కాంగ్రెస్ దేశాన్ని ముక్కలు చేసింది : యూపీ సీఎం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ దేశాన్ని కేవలం దోచుకోవడమే కాదు, ముక్కలు చేసిందని విమర్శించారు. ఒక వర్గం వారు శ్రీరాముడి ఉనికినే లేదని వాదించేవారు, అంటే వారు అయోధ్య ఉనికిని కూడా అంగీకరించడానికి ఇష్టపడలేదన్నారు. వారు కోర్టులో నిరంతరం పోరాటం సాగించారని, రామ జన్మభూమి ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి న్యాయవాదుల సైన్యాన్నే రంగంలోకి దించారని విమర్శించారు. 'జై శ్రీరామ్' అని నినదించేవారిపై లాఠీలు ఝుళిపించి, కాల్పులు జరిపిన వారు ఉన్నారని మండిపడ్డారు. వారే ఇప్పుడు విశ్వాసంతో చెలగాటం ఆడుతున్నారని మాట్లాడుతున్నారన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఆరిపోయే దీపమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. - అక్షరటుడే, వికారాబాద్



# రేవంత్ రెడ్డి ఓ ఆరిపోయే దీపం

■ హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ■ మా కార్యకర్తలను వేధిస్తున్న పోలీసులను వదిలిపెట్టం ■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్రంలో ఎస్ఐఆర్, పార్టీ సభ్యత్వ నమోదుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరిగిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కొందరు పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను సతాయిస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఆరిపోయే దీపమని, ఆయన ఎక్కువ రోజులు అధికారంలో ఉండరన్నారు. ఆ తర్వాత తమ పార్టీ కార్యర్తలను వేధించిన పోలీస్ అధికారుల్ని కాపాడేవాళ్లు ఎవరూ ఉండరని తెలిపారు. డ్యూటీ చేయండి... అతి చేయకండి అని హితవు పలికారు. రిటైర్ అయినా, ఎక్కడ దాకున్నా.. తమ సర్కార్ వచ్చాక ఒక్కొక్కరిని వెతికి మరీ మిత్తితో సహా తిరిగిచ్చే బాధ్యత తనదని హెచ్చరించారు.

### కాంట్రాక్టులు ఇస్తామని..

కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 72 శాతం కాంట్రాక్టులు ఇస్తామని రేవంత్ రెడ్డి అన్నారని కేటీఆర్ గుర్తు చేశారు. అంటే.. రూ. 4,400 కోట్ల కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మూడు వేల కోట్ల కాంట్రాక్టులు ఇవ్వాలన్నారు. కానీ మూడు రూపాయలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం పేరు మీద రూ. 12 లక్షలు ఇస్తమని, పన్నెండు పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

### రాజకీయ సన్యాసం తీసుకుంటా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రంలోని రూ. 1.67 కోట్ల ఆడ కూతుర్లకు వారి ఖాతాలో రూ. 1.50 లక్షల చొప్పున వేస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని పేర్కొన్నారు.

### భూములు గుంజుకుంటున్నారు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతలు అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. అయితే అధికారంలోకి రాగానే.. పరిగిలో అసైన్డ్ భూముల గుంజుకుంటున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిందన్నారు.

## తెరుచుకున్న కామాఖ్య ఆలయం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అస్సాంలోని ప్రసిద్ధ శక్తిపీఠమైన కామాఖ్య దేవాలయం తలుపులు నేడు ఉదయం తిరిగి తెరుచుకున్నాయి. వార్షిక 'అంబుబాచి మేళా' సందర్భంగా మూడు రోజులు ఆలయ గర్భగుడిని పూర్తిగా మూసేశారు. నేడు ఆలయం మళ్లీ తెరవడంతో అమ్మవారి ప్రత్యేక ప్రసాదాలైన పవిత్ర జలం (అంగోదక్), ఎర్రటి వస్త్రం కోసం భక్తులు పోటెత్తారు. అంబుబాచి మేళా తూర్పు భారతదేశంలోని అతిపెద్ద మరియు అత్యంత ముఖ్యమైన మతపరమైన కార్యక్రమాలలో ఒకటి. ఈ ఉత్సవం జూన్ 22న ప్రారంభమైంది. జూన్ 22 రాత్రి 9:08 గంటలకు 'ప్రవృత్తి' అనే ఆచారంతో ఈ ఉత్సవం మొదలైంది. ఇది కామాఖ్య దేవి వార్షిక ఋతుక్రమ కాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. ఈ ఆచారం తర్వాత ఆలయ ద్వారాలు మూడు రోజుల పాటు మూసి ఉంచారు. ఈ సమయంలో భక్తులను గర్భాలయంలోకి అనుమతించరు. శుక్రవారం ఉదయం నిత్య పూజ పూర్తయిన తర్వాత ఆలయ ద్వారాలు తిరిగి తెరుచుకున్నారు.

## పలు జిల్లాలకు వర్ష సూచన



**అక్షరటుడే, హైదరాబాద్:** ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణలోని జిల్లాల్లో శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దక్షిణ, పశ్చిమ తెలంగాణలో అక్కడక్కడా మోస్తసు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. వానాకాలం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా భారీ వర్షాలు పడడం లేదు. జూన్ 8న తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. అనంతరం అవి బలహీనపడ్డాయి. ఆలస్యంగా తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాయి. రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. అయితే భారీ వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

## ఓల్డ్ సిటీ గోల్డ్ మ్యాన్ సూర్యాభాయ్ అరెస్ట్




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ఓల్డ్ సిటీ గోల్డ్ మ్యాన్‌గా పేరొందిన సూర్యాభాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిని అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ప్రాణ స్నేహితుడిని అని చెప్పుకొని సూర్యాభాయ్ పలువురి వద్ద రూ.లక్షలు వసూలు చేశాడు. సూర్యాభాయ్ అసలు పేరు పల్లపు సురేష్ కుమార్. ఒంటి నిండా కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు ధరించి సోషల్ మీడియాలో పాపులర్ అయ్యాడు. తక్కువ ధరకు స్వచ్ఛమైన బంగారం ఇప్పిస్తానని పలువురి దగ్గర డబ్బులు వసూలు చేశాడు. డబ్బులిచ్చి నెలలు గడుస్తున్నా బంగారం ఇవ్వలేదని ప్రశ్నించిన వారిని బెదిరించాడు. దీంతో మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన అత్తాపూర్ పోలీసులు తాజాగా అతడిని అరెస్ట్ చేశారు.

## సాయికృష్ణ లాకప్‌డెత్.. డెడ్‌బాడీని మాయం చేసింది వారే..



**అక్షరటుడే, ఏపీ:** సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో సిట్ విచారణ వేగవంతం చేసింది. విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణను హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే సీఐ నాగరాజ్‌ను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. నాగరాజు డెడ్‌బాడీ మాయం చేయడానికి సీఐకి మరో ఇద్దరు కానిస్టేబుళ్లు సహకరించినట్లు సిట్ గుర్తించింది. దీంతో పరారీలో ఉన్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల ఫోన్ సిగ్నల్స్‌ను సిట్ అధికారులు ట్రాక్ చేస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ అశోక్ సీఐ అసిస్టెంట్‌గా ఉన్నాడు. ఆయన ఇంటికి సిట్ అధికారులు వెళ్లారు. అయితే ఇంట్లో అతడు లేకపోవడంతో వెనుతిరిగారు. సాయికృష్ణ మృతదేహాన్ని ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, సీఐ స్నేహితుడు మాయం చేసినట్లు సిట్ విచారణలో తేలింది.

## వెనిజులా భూకంపం.. 235కు చేరిన మృతుల సంఖ్య



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** వెనిజులాలో గురువారం రెండు భారీ భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ప్రకంపనల ధాటికి చాలా భవనాలు నేలమట్టమయ్యాయి. విపత్తు వల్ల మరణించిన వారి సంఖ్య 235కు చేరింది. 1,500 మందికి పైగా గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి.

## గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై బైక్ ఢీకొని ఇద్దరు మృతి





**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి ఏఎంబీ మాల్ ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోకుండా రాంగ్ రూట్‌లో దూసుకొచ్చిన ఒక స్కూటీని, వేగంగా వస్తున్న బుల్లెట్ బైక్ బలంగా ఢీకొట్టింది. స్కూటీపై ప్రయాణిస్తున్న శ్రీకాంత్, విఠల్ అనే ఇద్దరు వ్యక్తులు ఘటనా స్థలంలోనే తీవ్ర రక్తస్రావంతో మరణించారు. బుల్లెట్ బైక్ నడుపుతున్న వినోద్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అతడిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## అయోధ్య ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ రాజీనామా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అయోధ్య ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేశారు. రామమందిర విరాళాల వ్యవహారంపై వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. అలాగే ట్రస్టీ అనిల్ మిశ్రా కూడా తన బాధ్యతల నుంచి వైదొలిగారు.

## ఆపరేషన్ సిందూర్ అమరవీరుల వివరాలు వెల్లడి..



**అక్షరటుడే, ఢిల్లీ:** జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన ఆరుగురు సైనికులను కేంద్ర ప్రభుత్వం స్మరించుకుంది. దేశ రక్షణ కోసం వారు చేసిన త్యాగానికి గుర్తింపుగా, వారి పేర్లను ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకంలోని గ్రెనైట్ పలకలపై శాశ్వతంగా చెక్కనున్నట్లు ప్రకటించింది. వీరమరణం పొందిన వారిలో ఐదుగురు ఆర్మీ జవాన్లు, ఒక వైమానిక దళ సర్జెంట్ ఉన్నారు. సుబేదార్ మేజర్ పవన్ కుమార్, రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్, లాన్స్ నాయక్ దినేష్ కుమార్, అగ్నివీర్ మూడ్ మురళీ నాయక్, హవిల్దార్ సునీల్ కుమార్ సింగ్ , సర్జెంట్ సురేంద్ర కుమార్ తమ ప్రాణాలను అర్పించారు.